హైదరాబాద్ వార్త



# అక్షర యోధుడికి అశ్రునివాళి

**-రామోజీరావు మృతితో విషాదఛాయలు**

హైదరాబాద్, జూన్ 8 ప్రభాతవార్త

రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు కన్నుమూశారు. శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది ఎదురవడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచా రు. అనంతరం ఆయన పార్థివదేహాన్ని రామోజీ ఫిల్మ్‌సిటీకి తరలించారు. ఈ సందర్భంగా ఫిలింసిటీలో విషాదఛాయలు అలుముకున్నాయి. రామోజీరావుకు నివాళులు అర్పించేందుకు పెద్ద సంఖ్యలో నగరానికి చెందిన సినీ, రాజకీయ ప్రముఖులు తరలివెళ్లారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, మాధవరం కృష్ణారావు, దానం నాగేందర్, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ తదితరులు రామోజీరావు పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అక్షర యోధుడుగా పేరున్న రామోజీ తెలుగు రాష్ట్రాలకు, దేశానికి అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.



రామోజీరావు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, దానం నాగేందర్ తదితరులు

# కౌన్ బనేగా "సెంట్రల్ మినిస్టర్ "

**-రేసులో కిషన్‌రెడ్డి, ఈటెల రాజేందర్**

**-ఇప్పటికే లాబీయింగ్ చేస్తున్న నేతలు**

**-గ్రేటర్‌లో ఎవరికి ఛాన్స్ వస్తుందని జోరుగా చర్చ**



ఈటెల



కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:

నేడు ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం నుంచి ఎవరు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారనే చర్చ జోరుగా సాగుతుంది. ఇప్పటికే నేతలు ఎవరికి వారు లాబీయింగ్ చేసకుంటున్నారు. ఎలాగైనా కేంద్రమంత్రి వర్గంలో స్థానం దక్కించుకోవాలని ఉవ్విళ్లురుతున్నారు. రాష్ట్రంలో మొత్తం 8 లోకసభ స్థానాలు గెలుచుకోగా అందులో మూడు స్థానాలు గ్రేటర్ పరిధిలో ఉన్నాయి. సికింద్రాబాద్ నుంచి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, మల్కాజ్‌గిరి నుంచి ఈటెల రాజేందర్, చేవేళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. ఈనేపథ్యంలో వీరిలో ఒకరికి కేంద్ర మంత్రి పదవి గ్యారంటీ అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో నగరానికి చెందిన బండారు దత్తాత్రేయకు వాజ్‌పేయ్, మోదీ హయాంలోనూ మంత్రి పదవులు లభించాయి. కేబినెట్ మంత్రితోపాటు కేంద్ర సహాయ మంత్రిగా కూడా ఆయన పనిచేశారు. అలాగే సికింద్రాబాద్ నుంచి రెండోసారి ఎంపిగా గెలిచిన కిషన్‌రెడ్డి సైతం మోదీహయాంలో తొలుత హోంశాఖ సహాయమంత్రి, ఆతర్వాత పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖల మంత్రిగా అవకాశం దక్కింది. అయితే ఈసారి కూడా కిషన్‌రెడ్డికే అవకాశం దక్కుతుందని ఆయన అభిమానుల్లో చర్చ జరుగుతుంది. అలాగే ఇప్పటికే కిషన్‌రెడ్డికి రెండుసార్లు అవకాశం దక్కింది, రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా ఆయనే ఉన్నారు కాబట్టి కొత్త వారికి అవకాశం లభిస్తుందన్న అభిప్రాయాలు సైతం వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో మల్కాజ్‌గిరి నుంచి గెలుపొందిన ఈటెల రాజేందర్‌కు కూడా కేంద్రమంత్రి పదవి వరించే అవకాశం ఉందన్న చర్చ ప్రజల్లో జోరుగా నడుస్తుంది. గతప్రభుత్వ హయాంలో కీలకపాత్ర పోషించడం, అన్నివర్గాలను కలుపుకునపోయే తత్వం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని తగిన ప్రాధాన్యం ఇవ్వవచ్చునని తెలుస్తుంది. రాష్ట్రం నుంచి ఒకవేళ సామాజిక వర్గాల వారీగా ఇవ్వాలనుకుంటే ఓసిగా కిషన్‌రెడ్డి లేదా డికె అరుణ, బిసిలకైతే ఈటెలరాజేందర్ లేదా బండిసంజయ్‌లకు అవకాశం దక్కవచ్చుననే వార్తలు వినిపిస్తుంది.

# పార్కింగ్ సమస్యలకు చెక్ ..

**-త్వరలో "మల్టీలెవల్ పార్కింగ్ సిస్టమ్ "**

**-రద్దీప్రాంతాల్లో ఏర్పాటుకు జిహెచ్‌ఎంసి చర్యలు**

**-మొదటగా కెబిఆర్ పార్కు వద్ద ఏర్పాటుకు నిర్ణయం**



పార్కింగ్

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:

నగరంలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యకు చెక్‌పెట్టేందుకు జిహెచ్‌ఎంసి చర్యలు తీసుకుంది. పార్కింగ్ స్థలాల కొరతను తీర్చిదిద్దేందుకు మల్టీలెవల్ పార్కింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్దమైంది. అందులోభాగంగా ముందుగా రద్దీ ఎక్కువగా ఉండే కెబిఆర్ పార్కులో ఈసిస్టంను అయాలని నిర్ణయించింది. దీనికి 3కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 405 చదరపు మీటర్ల విస్తీర్ణంలో కార్లు, బైక్‌లు పార్కింగ్ చేసేందుకు దీనికి నిర్మించనున్నారు. 70శాతం కార్లు, 30శాతం బైక్‌ల పార్కింగ్ కోసం ఈప్రాజెక్ట్ రూపకల్పన చేశారు. ప్రతిరోజు ఉదయం 5గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ఈమల్టీలెవల్ పార్కింగ్ తెరిచి ఉంచుతారు. పార్కింగ్ చేసే దగ్గర సిసి కెమెరాలు, లైటింగ్ కూడా ఏర్పాటు చేస్తారు. అలాగే త్వరలో నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో కూడా ఇలాంటి మల్టీలెవల్ పార్కింగ్ సిస్టమ్ జిహెచ్‌ఎంసి ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తుంది. 10అంతస్తుల బిల్డింగ్‌లో ఐదు అంతస్తులు వ్యాపారులకు, మరో ఐదు మల్టీ లెవల్ పార్కింగ్, షాపింగ్ మాల్స్‌కు కేటాయించనున్నట్లు తెలుస్తుంది.

# ఎమ్మెల్యేగా శ్రీగణేష్ గెలుపుతో కంటోన్మెంట్‌లో సంబురాలు



బైక్‌ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంతరావు, ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్, జూన్ 8 ప్రభాతవార్త :

కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా శ్రీగణేష్ గెలుపొందిన సందర్భంగా శనివారం 150 వ డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు భారీ బైకుర్యాలీ నిర్వహించి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా పార్లమెంట్ ఇంచార్జి మైనం పల్లి హనుమంతరావు హాజరయ్యారు. మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకులు అల్లాడి గౌరి శంకర్, చిర్రబోయిన సంతోష్ యాదవ్‌ల ఆద్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బైక్ ర్యాలీతో పాటు వివిధ కళాబృందాలచే భారీ ఎత్తున విన్యాసాలు చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ఘనస్వాగతం పలుకుతూ పూలు చల్లి అభినందనలు తెలిపారు. అనంతరం నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్ ఆద్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సి.కృష్ణ యాదవ్, గొల్లకిట్టు, బాబురావు ముదిరాజ్, నందికంటి రవి, బద్రీనాథ్ యాదవ్, ఆర్డీనగేష్ యాదవ్, డి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థలు ప్రారంభం కానున్నందున మార్కెట్లలో విపరీతమైన రద్దీ

చార్మినార్, జూన్ 8 ప్రభాతవార్త :

విద్యా సంస్థలు మరో మూడు రోజులలో ఈ నెల 12వ తేదీ నుంచి తిరిగి తెరుచుకోనున్నాయి. పాఠశాలలకు వేసవి సెలవులు 11వ తేదీతో ముగియనున్నాయి. బుధవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న సందర్భంగా చార్మినార్, ముర్గీచౌక్ ప్రాంతాలలోని మార్కెట్లు కొనుగోలుదారులతో రద్దీగా ఉంటున్నాయి. హైదరాబాద్ పాతనగరంలో ఎక్కువ బీద ప్రజలు నివాసం ఉంటున్నారు. కాగా పాతబస్తీలోని పలు మార్కెట్లలో స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు తక్కువ ధరలకు లభిస్తున్నాయి. దీంతో పాతబస్తీకి చెందిన బీద విద్యార్థులు చార్మినార్, ముర్గీచౌక్, మహ్మద్ క్యాప్ మార్ట్, శాలిబండ, మోతీగలీ, మొగల్‌పుర, ఛత్తాబజార్ ప్రాంతాలలో విక్రయిస్తున్న షాపులలో నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగులను కొనుగోలు చేస్తున్నారు. విద్యార్థులు పాత పాఠ్య పుస్తకాలు ఖరీదు చేయటంతో ముర్గీచౌక్ మార్కెట్ కొనుగోలు దారులతో కళకళ లాడుతున్నది. కాగా పాఠశాలలు ప్రారంభం కాగానే ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలను అందజయనున్నామని చార్మినార్ మండలం ఉప విద్యాశాఖాధికారి ఐ.నెహ్రూ నెహ్రూ బాబు వెల్లడించారు.

## తాళం వేసిన ఇంట్లో పట్టపగలు చోరీ..

**కొంపల్లి, జూన్ 8, ప్రభాతవార్త :** నిజాంపేట్‌లో పట్ట పగలే దొంగతనం జరిగి నగదు, నగలు ఎత్తుకెళ్లిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో నివాసం ఉండే షేక్ అబ్దుల్ గఫార్ వృత్తి రీత్యా టైలర్. జర్నలిస్ట్ కాలనీలోని తన ఇంటికీ శుక్రవారం తాళం వేసి టైలరింగ్ పనుల నిమిత్తం షాప్‌కి వెళ్లాడు. ఇంట్లో కుటుంబ సభ్యులు సైతం లేకపోవడంతో దొంగలు ఇంట్లోకి చొరబడి ఇంటికి వేసిన తాళానికి మరో డూప్లికేట్ కీతో తాళం తీసి తాపీగా దొంగతనానికి పాల్పడ్డారు. బీరువాలో ఉన్న రూ. 5లక్షలు నగదు, 10 తులాలు బంగారం దోచుకెళ్లారు. రాత్రికి టైలరింగ్ విధులు ముగించుకొని ఇంటికీ వచ్చిన అబ్దుల్ గఫార్ బెడ్ రూమ్‌లోకి వెళ్లి చూడగా బీరువా ఓపెన్ చేసి ఉంది. అనుమానంతో బీరువాను పరిశీలించగా బీరువాలో ఇళ్లు కొనేందుకు దాచిన రూ.5లక్షలు నగదుతో పాటు 10తులాల బంగారం కనిపించలేదు. దొంగతనం జరిగినట్లుగా గ్రహించి బాచుపల్లి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దొంగతనం జరిగిన ఇంటిని బాచుపల్లి క్రైమ్ పోలీసులు పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఈ ఘటన పట్టపగలే జరగడం తాళం కూడా వేసి ఉండడం చూస్తుంటే తెలిసనవారి పనిగానే స్థానికులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హైదరాబాద్ శివార్లలో రౌడీషీటర్ హత్య

**-గొంతు కోసి కడతేర్చిన ప్రత్యర్థులు**

సరూర్‌నగర్, జూన్ 8 ప్రభాతవార్త:

హైదరాబాద్ నగర శివార్లలో ఓ రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. పాత కక్షలతో ప్రత్యర్థులు గొంతు కోసి కిరాతకంగా హత్య చేశారు. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్మన్‌ఘాట్ ఇన్నర్ రింగ్ రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో నిర్మానుష్య ప్రదేశంలో నందనవనంకు చెందిన సలా ్మన్ (25) అనే యువకుడు గొంతు కోయబడి కత్తిపోట్లతో ఉండగా సమాచారం అందుకున్న సోదరుడు అర్భాజ్ ఖాన్ చికిత్స నిమి త్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్ ధృవీ కరించారు. ఈ మేరకు మృతుని తల్లి షబానా బేగం మీర్‌పేట్ పిఎస్‌లో ఫిర్యాదు చేసింది. అయితే హత్యకు గురైన సలా ్మన్ మీర్‌పేట్ పిఎస్‌లోనే రౌడీషీటర్‌గా నమోదై ఉన్నాడు. అంతే కాకుండా ఇతనిపై పిడి యాక్టు కూడా ఉంది. మతాంతర వివాహం చేసుకున్న సోదరి షబానా ఫాతిమా భర్త దాసరి సురేందర్ అలియాస్ సూరి చేతిలో హత్యకు గురైనప్పటి నుండి సల్మాన్‌కు, సురేందర్‌కు మధ్య కక్షలు ఉన్నాయి. అయితే పథకం ప్రకారం సూరి అతని అనుచరులు సల్మాన్‌ను అయ్యప్ప దేవాలయం సమీ పంలోని నిర్మానుష్య ప్రదేశానికి రప్పించి అక్కడ దారుణంగా హత్య చేసినట్లుగా పోలీసులు ప్రాథ మికంగా నిర్ధారించారు. ఈ మేరకు ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రాత్రి 11 తర్వాత అందుబాటులో లేని మెట్రోలు

**- రైళ్ల వేళలను సరిచేయాలంటున్న ప్రయాణికులు**



హైదరాబాద్, జూన్ 8 ప్రభాతవార్త

మెట్రో రైళ్ల వేళలను మార్చకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హైటెక్‌సిటీ నుంచి కూడా మెట్రో అందుబాటులో ఉంది. కానీ ఉదయంపూట సర్వీసులు లేకపోవడంతో ఆటోలు, క్యాబ్‌లలో రెట్టింపు చార్జీలు చెల్లించాల్సి వస్తోంది. ప్రస్తుతం నగరంలోని వివిధ మార్గాల్లో మెట్రో రైళ్లు ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతున్నాయి. రాత్రి 11 గంటలకు ఆఖరి రైలు చివరి స్టేషన్ నుంచి బయలుదేరుతోంది. వినాయ నిమజ్జన వేడుకలు.. క్రికెట్ మ్యాచ్‌లు వంటి ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే మెట్రో వేళలను పొడిగిస్తున్నారు. కానీ రెగ్యులర్ ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉదయం 5 గంటల నుంచే రైళ్లను అందుబాటులో ఉంచితే ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

కొంతకాలంగా నగరంలో సిటీలైఫ్ పెరిగింది. అర్ధరాత్రి వరకు వేడుకలు, ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. రెస్టారెంట్‌లు, మార్కెట్‌లు అందుబాటులో ఉంటున్నాయి. మరోవైపు నగరాన్ని సందర్శించేందుకు వచ్చే పర్యాటకులు కూడా నచ్చిన ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఎక్కువ సమయం గడిపేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొత్త సచివాలయం కొలువుదీరిన తర్వాత ఆ భవనాన్ని, నెక్లెస్‌రోడ్డులోని అంబేద్కర్ విగ్రహాన్ని, తెలంగాణ అమరుల స్మారకాన్ని సందర్శించే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వారు రాత్రి పూట ఏ కొంచెం ఆలస్యంగా బయలుదేరినా గమ్యం చేరుకోవడం కష్టమే. రాత్రి 11 దాటిన తరువాత సిటీ బస్సులు అందుబాటులో ఉండడంలేదు. ఆటోవాలాలు ప్రయాణికులను దోచుకుంటున్నారు. రాత్రి సిటీకి చేరుకొనే దూరప్రాంతాల ప్రయాణికులకు, సిటీ నుంచి బయలుదేరేవారికి ప్రయాణం మరింత భారంగా మారింది.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌తో పాటు నాంపల్లి రైల్వే స్టేషన్, బేగంపేట్, హైటెక్‌సిటీ, లింగంపల్లి స్టేషన్‌ల నుంచి కూడా ప్రయాణికుల రాకపోకలు భారీగా పెరిగాయి. మహాత్మాగాంధీ బస్సు స్టేషన్, జూబ్లీ బస్‌స్టేషన్, ఎల్‌బీనగర్, ఉప్పల్ వంటి కూడళ్ల నుంచి కూడా తెల్లవారుజామున ప్రయాణికుల రాకపోకలు ఎక్కువే. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత నగరానికి వచ్చే రైళ్లు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ప్రస్తుతం నాగోల్ నుంచి రాయదుర్గం వరకు, ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్ వరకు, ఎంజీబీఎస్ నుంచి జేబీఎస్ వరకు ప్రధాన రైల్వే స్టేషన్‌లకు మెట్రో స్టేషన్‌లు చాలా వరకు అందుబాటులోనే ఉన్నాయి. ఎల్‌బీనగర్, మియాపూర్ వంటి దూర ప్రాంతాల నుంచి సికింద్రాబాద్, నాంపల్లి స్టేషన్‌లకు చేరుకోవచ్చు. ఈ క్రమంలో ప్రతి శుక్ర, సోమవారాల్లో ప్రయోగాత్మకంగా చేసిన మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల డిమాండ్ మేరకు సర్వీసులను రెగ్యులర్ చేయనున్నట్లు ఎల్అండ్‌టీ మెట్రో తెలిపింది. సాధారణంగా ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే మెట్రో రైళ్లు అందుబాటులో ఉంటాయి. ప్రయాణికుల సౌకర్యం కోసం ట్రయల్ ప్రాతిపదికన సోమ, శుక్రవారాల్లో మాత్రమే సర్వీస్ వేళలను పొడిగిస్తున్నాం అని అధికారులు స్పష్టం చేశారు. ఇదే వేళలను మిగతా రోజుల్లోనూ కొనసాగిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ దిశగా మెట్రో రైల్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌కు అనుగుణంగా మెట్రో వేళలను సైతం క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడుతున్న దొంగల అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ రావుల, చిత్రంలో ఏసీపీ జగన్, ఇన్స్‌పెక్టర్ రాజెందర్ తదితరులు

తార్నాక, జూన్ 8 ప్రభాతవార్త :

సెల్‌ఫోన్లను స్నాచింగ్ కు పాల్పడుతున్న దొంగలు, బైక్‌లను తస్కరించి తప్పించుకు తిరుగుతున్న రెండు ముఠాలకు చెందిన దొంగలను ఓ.యూ పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఓ.యూ ఏసీపీ కార్యాలయంలో శనివారం నిందితులన వివరాలను ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ రావుల, ఓ.యూ ఏసీపీ జగన్ వెల్లడించారు. చిత్రనాక గౌలిపురకు చెందిన కంసాల అరుణ్‌కుమార్ అలియాస్ నాని(23) పాత నేరస్తుడు. సెల్‌ఫోన్ స్నాచింగ్, బైక్ దొంగతనాలకు పాల్పడి పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. ఇతనిపై మొగల్‌పుర, ఫలక్‌నుమా, అబిడ్స్, సరూర్‌నగర్ పిఎస్‌లల్లో ఆరు కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. ప్రస్తుతం సరూర్‌నగర్ మండలాఫీస్ సమీపంలో నివాసముంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన తస్మద్ స్నేహ అలియాస్ నిక్కు(20)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. తనతో భార్యను కూడా దొంగతనాలు చేయిస్తున్నాడు. చాధర్‌ఘాట్‌కు చెందిన పనగంటి రఘుబాబు(20), మరో మైనర్‌తో కలిసి ఒక ముఠాగా ఏర్పాడ్డారు. మల్కాజిగిరి వసంతపురి కాలనీకి చెందిన డెకరేషన్ పనులు చేసే బూస శాంసన్ అలియాస్ టింకు(19), అదే ప్రాంతానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి కొణిపాక ప్రశాంత్ అలియాస్ చింటు (21), లాలాపేట్ శాంతినగర్‌కు చెందిన మల్తుంకార్ మధు (19) మరో ముఠాగా ఏర్పడి సెల్‌ఫోన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఈ రెండు ముఠాల సభ్యులు వారు చోరి చేసిన బైకులపై రాత్రి సమయాల్లో రోడ్లపై తిరుగుతూ, ఫుట్‌పాత్, బస్టాప్‌లల్లో, ఒంటరిగా వెళ్లుతున్న వారిని లక్ష్యంగా చేసుకొని సెల్‌ఫోన్లను దొంగిలించి తప్పించుకుంటున్నారు. చోరి చేసిన ఫోన్లను ఎండి ఊరుఫ్, షేక్ అలీ, వి.రాజులకు తక్కువ ధరలకే విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలకు పాల్పడుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించిన పోలీసులు డెకాయిట్ ఆపరేషన్ చేసి రెండు ముఠాలను పట్టుకొని 22 సెల్‌ఫోన్లను, నాలుగు బైకులను స్వాదీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓ.యూ ఇన్స్‌పెక్టర్ ఎన్.రాజెందర్, క్రైం ఎస్సై సిహెచ్.రవి ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చేపప్రసాదానికి పోటెత్తిన జనం











హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:

నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో చేపప్రసాదం పంపిణీ ప్రారంభమైంది. శనివారం మొదటిరోజు చేపమందు వేసుకునేందుకు తెలుగు రాష్ట్రాల తో పాటు బిహార్, యూపీ, చత్తీస్‌ఘడ్, ఢీల్లీ, హర్యానా రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివచ్చారు. వేలాదిమందితో రాకతో నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్ కిక్కిరిసిపోయింది. మందు కోసం అస్తమా బాధితులు పోటెత్తడంతో క్యూలైన్లలో మూడు నాలుగు గంటల సమయం పడు తుంది. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు జనం భారీగా తరలిరావడంతో ఆప్రాంతం లో ట్రాఫిక్ జాం అయ్యింది. ఆదివారం ఉదయం 11గంటల వరకు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు నిర్వహాకులు తెలిపారు.

## ఎమ్మెల్యే వివేకానందను కలిసిన బండారి లేఅవుట్ సంక్షేమ సంఘం సభ్యులు


సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరుతున్న సంక్షేమ సంఘం సభ్యులు

**నిజాంపేట్, జూన్ 8, ప్రభాతవార్త**
బండారి లే అవుట్ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు తురక చెరువు అభివృద్ధి పనుల గురించి శనివారం ఎమ్మెల్యే కేపీ వివేకానందను కలిసి మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్, మున్సిపల్ శాఖ వారితో సోమవారం ఉదయం 10:30 గంటలకు సమావేశం అవుతానని, చెరువు యొక్క సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. తురక చెరువు సర్వే, చెరువు ఫెన్సింగ్ కూడా ప్రారంభించడానికి నిర్ణయించినట్లు తెలిపారు.

### రామోజీరావు మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు : ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, జూన్ 8 ప్రభాతవార్త:** ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, పద్మవిభూషణ్ రామోజీరావు మరణం తెలుగు రాష్ట్రాలతో పాటు విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు తీరని లోటని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ తెలిపారు. నిబద్ధత కలిగిన జర్నలిజం రంగంలో రాణించి, మీడియా రంగంలో తన చెదరని ముద్ర వేయడంతో పాటు తాను చెపట్టిన అన్ని వ్యాపారాల్లో సృజనాత్మకత, విలువలను పాటించి అందరికి ఆదర్శంగా నిలిచారని పద్మారావు గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సినిమా రంగంలో కూడా తన ప్రత్యేకతను చాటుకున్నారని, విలక్షణ చిత్రాలను నిర్మించి తెలుగు వారి కీర్తిని దశదిశలా చాటారని కొనియాడారు. అత్యత్భుతమైన రామోజీ ఫిల్మ్ సిటీని నిర్మించి హైదరాబాద్‌కు వన్నె తెచ్చారని, తెలుగు భాష విశిష్టతను పరిరక్షించేందుకు, పర్యావరణ పరిరక్షణకు, నీటి వనరుల సంరక్షణకు, కృషి చేసి అందరికి మార్గదర్శకంగా నిలిచారని, అంత కంటే ముఖ్యంగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మద్య నిషేదానికి రామోజీరావు ఉద్యమమే చేశారని వివరించారు. రామోజీరావు సేవలు శ్లాఘనీయమని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. రామోజీ రావు ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులు మనో ధైర్యంతో ముందుకు సాగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పద్మారావు గౌడ్ వివరించారు.

## శ్రీ చైతన్య హై స్కూల్‌పై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

**పేట్ బషీరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన నడుపుతున్న శ్రీ చైతన్య పాఠశాలపై కుత్బుల్లాపూర్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సంఘం ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యే కేపీ వివేకానందకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా విద్యాధికారితో ఫోన్‌లో మాట్లాడి వెంటనే అనుమతులు నిలిపివేయాలని నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీ చైతన్య పాఠశాల వల్ల 40 బడ్జెట్ పాఠశాలల వారికి ఇబ్బంది కలిగే రకంగా ఉన్నదని, దీని అనుమతులు నిలిపివేయాలని, ఎటువంటి అనుమతులు ఇవ్వవద్దని కోరారు. కుత్బుల్లాపూర్ మండల్ రికగ్నిషన్స్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు మహేష్ కుమార్, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి గోవర్ధన్‌రెడ్డి, చైర్మన్ పి.శివయ్య, వైస్ చైర్మన్ మండవ శ్రీనివాస్‌గౌడ్, మాజీ అధ్యక్షులు వరప్రసాద్, సెయింట్ ఆంథోనీ హై స్కూల్ కరెస్పాండెంట్ సుందర్ రాజ్ పాల్గొన్నారు.

### 10న శ్రీఉజ్జయినీ మహంకాళీ అమ్మ వారి ఆలయంలో హుండీ లెక్కింపు

**బేగంపేట జూన్ 8,ప్రభాతవార్త**
సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో ఈ నెల 10వ తేదీన హుండీల లెక్కింపు కార్యక్రమం ఉందని ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి తెలియజేసారు.సోమవారం ఉదయం గం 9.30నిలకు దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో,ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్,మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు, మరియూ భక్తుల సమక్షంలో హుండీలు లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ ఓ తెలిపారు.

## అమెరికా యూనివర్సిటీ నుంచి గౌవర డాక్టరేట్ అందుకున్న చంద్రశేఖర్‌రెడ్డి


అమెరికా డస్ప్రింగ్ క్రిస్టెన్ యూనివర్సిటీ ప్రతినిధుల నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకుంటున్న తెలంగాణ బిడ్డ పి.చంద్రశేఖర్‌రెడ్డి దృశ్యం

**నార్సింగి, జూన్ 8 ప్రభాతవార్త :**
స్విమ్మింగ్ క్రీడలో అనేక జాతీయ, అంతర్జాతీయ స్థాయి పతకాలు సాధించి మువ్వన్నెల పతకాన్ని రెపరెపలాడించిన తెలంగాణ ముద్దుబిడ్డ పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డికి శనివారం అమెరికాకు చెందిన డస్ప్రింగ్ క్రిస్టెన్ యూనివర్సిటీ ప్రతినిధులు "గౌరవ డాక్టరేట్"ను ఇచ్చి అభినందించారు. క్రీడాకారుడిగానే కాకుండా స్విమ్మింగ్ క్రీడా వ్యాప్తి కోసం గత దశాబ్ద కాలంగా చంద్రశేఖర్‌రెడ్డి చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డును ఇవ్వడం జరిగిందని యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ డాక్టరేట్ తనకు అనంతమైన ఆనందాన్ని కలిగించిందన్నారు. స్విమ్మింగ్ క్రీడా వ్యాప్తికి మరింత అంకిత భావంతో పని చేస్తానని స్పష్టం చేశారు. చేస్తున్న పనిని గుర్తించి, అభినందిస్తే రెట్టించిన ఉత్సాహం లభిస్తుందన్నారు. అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీ నా సేవలు గుర్తించి గౌరవ డాక్టరేట్ ఇవ్వడం జీవితంలో మరిచిపోలేనని చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిజిపిపి చైర్ పర్సన్ ప్రభుకిరణ్, ఉమెన్ ప్రెసిడెంట్ టి.సనీత, రెవరెండ్ ప్రొఫెసర్ రాజాజీ ప్రసాద్, మాస్టర్స్ స్విమ్మర్ డాక్టర్ క్వీన్ విక్టోరియా, అలివేలు మంగ, శ్రావ్యారెడ్డి,అఖిల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## వైస్ చాన్సలర్ నియామకాల్లో క్రిస్టియన్ మైనార్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**- క్రిష్టియన్ జెఎసి నాయకులు**

**తార్నాక, జూన్ 8 ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్రంలో త్వరలో నియమించబోయే వైస్ చాన్సలర్ల నియామకాల్లో క్రిస్టియన్ మైనార్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్, చర్చి ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్ట్ అసోసియేషన్, క్రిష్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వానికి కోరింది. ఈ మేరకు ఒ.యూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ప్రధాన కార్యదర్శి రెవ.డా. టి.భాస్కర్, చర్చి ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు క్రిష్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.సోలోమోన్ రాజు మాట్లాడుతు ప్రభుత్వం స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి క్రైస్తవులు మన రాష్ట్రంలో విద్యావిధానానికి, సామాజిక అభివృద్ధికై చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. అయినప్పటికి గతంలో ప్రభుత్వాలు ఉన్నత విద్యా విధానంలో క్రైస్తవులను విస్మరించారని, ఏ ఒక్కసారి కూడా క్రిష్టియన్ మైనార్టీలకు వీసి పోస్టులు ఇవ్వలేదని వాపోయారు. ఇప్పుడు ఏకకాలంలో అన్ని యూనివర్సిటీలకు వీసిలను నియమిస్తునందున క్రిష్టియన్ మైనార్టీలకు కూడా ఖచ్చితంగా అవకాశం ఇవ్వాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

## టిడిపి, జెడియు పార్టీలు బిజెపికి మద్దతు ఉపసంహరించుకోవాలి

**సైఫాబాద్, జూన్ 8 ప్రభాతవార్త:**
దేశ ప్రజల ప్రయోజనాలు, సమగ్రాభివృద్ధి, భవిష్యత్తు కోసం టిడిపి, జెడియు పార్టీలు బిజెపికి మద్దతు ఉపసంహరించుకుని ఇండియా కూటమికి మద్దతు ఇవ్వాలని అఖిల భారత తంజీమ్-ఏ-ఇన్సాఫ్ విజ్ఞప్తి చేసింది. గత పదేళ్ళలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నడూ లేనంతగా నిత్యావసర వస్తువుల ధరలను పెంచిందని, అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, న్యాయమైన పాలనను అందించకుండా ప్రజల విశ్వాసాలను దెబ్బతీసిందని ఆ సంస్థ ప్రతినిధులు ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్‌పటేల్, ఉపాధ్యక్షుడు ఎం.డి.అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ బిజెపి లౌకిక సమాజాన్ని విచ్ఛినం చేసి భారతదేశం యొక్క ప్రతిష్టను దిగజార్చిన విషయం టిడిపి నేత ఎన్.చంద్రబాబునాయుడు బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌కు తెలుసునని అయినప్పటికి బిజెపికి మద్దతు ఇవ్వడం సమంజసం కాదన్నారు. 'ఆప్ కీ బార్ చార్ సౌ పార్' అనే తప్పుడు సందేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళినా దేశ ప్రజలు బిజెపి కేవలం 240 సీట్లకే పరిమితం చేశారని, మేజార్టి సీట్లు 272కు చేరుకోలేక పోయిందని వారు ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలు, తీవ్ర ఆందోళనలు కలిగించే నిర్ణయాలు, హిందూ-ముస్లిం మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించిన ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అగ్రహంగా ఉన్నారని, అయోధ్యలోనే బిజెపి ఓడిపోయిందన్నారు. టిడిపి, జెడియు పార్టీలు బిజెపికి మద్దతు ఇవ్వకుండా తప్పుకుంటే దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, మోదీకి మిత్రులైన అదానీ, అంబానీల సంక్షేమమే ముఖ్యమని పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం ముఖ్యం కాదని వారు ఆరోపించారు. రాజ్యాంగ ప్రజాసామ్య, లౌకికవాద రక్షణకు ఇండియా కూటమికి టిడిపి, జెడియు మద్దతు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఇన్సాఫ్ ప్రతినిధులు ఖాసీం, మజారుద్దీన్, చాంద్‌పాషా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మునీర్ పటేల్

## కేంద్ర మంత్రివర్గంలో 50శాతం బిసిలకు అవకాశం ఇవ్వాలి

**-బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య**

**హైదరాబాద్, జూన్ 8,ప్రభాతవార్త:**
ప్రధానమంత్రి నరేంద్రమోదీ బిసికులాలకు చెందిన వారు కావడం వల్ల దేశంలో ఉన్న మెజార్టీ బిసిలందరూ బిజెపికి మద్దతిచ్చారని కావున త్వరలో ఏర్పాటు చేయబోయే కేంద్రమంత్రి వర్గంలో బిసిలకు 50శాతం అవకాశం ఇచ్చి ముఖ్యమైన శాఖలను కేటాయించాలని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కాచిగూడలో జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జసత్యం, కన్వీనర్ గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బిసిలు మెజార్టీ శాతం ప్రధాని మోదీని చూసి ఓట్లు వేశారని అందుకే 8సీట్లు గెలిచారన్నారు. కావున తెలంగాణ రాష్ట్రానికి 3మంత్రిపదవులు కేటాయించాలని కోరారు. అలాగే దేశంలోని 70కోట్లమందికి విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి విధానరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో అనేక సెంటిమెంట్లతో ఇంకా ప్రజలను తప్పుదారి పట్టించడం, మభ్యపెడుదామనే ఆలోచనలు మానుకోవాలని హెచ్చరించారు. ప్రజలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలని ధృఢ నిర్ణయం చేయడానికి జాతీయ పార్టీలు ముందుకు రావాలని ముఖ్యంగా బిజెపి ముందుండాలని కృష్ణయ్య కోరారు. ఈసమావేశంలో నాయకులు నీల వెంకటేష్, రాజేందర్, జిల్లపల్లి అంజి, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చౌటుపల్లి సురేష్, నందగోపాల్, రామకృష్ణ, ఉదయ్, మహిళా నాయకురాలు జయంతి, రాజ్‌కుమార్, ప్రీతం తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జసత్యం, గుజ్జకృష్ణ తదితరులు

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలి : ఎమ్మెల్యే

**బేగంపేట జూన్ 8,ప్రభాతవార్త**
ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలని,రానున్న రోజుల్లో ప్రజలకు మరింత చేరువగా వెళ్లాలని, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పోరేటర్లు,డివిజన్ అధ్యక్ష,కార్యదర్శులకు పిలుపు నిచ్చారు. శనివారం ఉదయం ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలోని కార్పోరేటర్లు, డివిజన్ అధ్యక్ష,కార్యదర్శులు,వివిధ విభాగాల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ వారీగా ఆయా డివిజన్లలో ఉన్న పరిస్థితులను అడిగి తెల్సుకున్నారు.ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తూ రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత చేరువయ్యేలా ముందుకు సాగాలని తెలిపారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉంటూ అధికారుల దృష్టికి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేద్దామని తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో నియోజకవర్గం కో ఆర్డినేటర్ సతీష్ అరోరా,కార్పోరేటర్లు ముద్దం నర్సింహయాదవ్,టి.మహేశ్వరి శ్రీహరి,ఆవుల రవీంద్రరెడ్డి,పండాల సతీష్‌గౌడ్,జూపల్లి సత్యానారాయణ, మందాడి శ్రీనివాసరావు,మాజీ కార్పోరేటర్ పగుడాల బాబూరావు,తూము శ్రావణ్‌కుమార్,డివిజన్ అధ్యక్షులు,కార్యదర్శులు,అనుబంధ సంస్థల అధ్యక్షులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.


కూకట్‌పల్లి నియోజకవర్గం కార్పోరేటర్లు,డివిజన్ అధ్యక్ష ,కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం.

## గోవులను రక్షించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

**సైఫాబాద్, జూన్ 8 ప్రభాతవార్త:** బక్రీద్ పండువను పురస్కరించుకుని హైదరాబాద్ నగరానికి వివిధ జిల్లాల నుంచి తరలిస్తున్న గోసంతతిని నిరోధించాలని భారతీయ ప్రాణి మిత్ర సంఘ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గోవులను రక్షించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందాయని సంఘ్ ఆరోపించింది. ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సంఘ్ నాయకులు హెచ్చరించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ్ అధ్యక్షుడు సిఎ జస్‌రాజ్‌శ్రీశ్రీమాల్, కార్యదర్శి మహేష్ అగర్వాల్, ప్రతినిధులు రిదీష్‌జాగీర్‌దార్, జస్మత్‌పటేల్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి నిత్యం వేలాది ఆవులు, ఎద్దులు, దూడలు అక్రమంగా వస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం చెక్‌పోస్టుల వద్ద పెద్ద ఎత్తున తనిఖీలను నిర్వహించి, వాటిని తిరిగి స్వస్థలాలకు పంపాలని, లేకపోతే ఈ నెల 10వ తేదీ నుంచి రోడ్లపైకి వచ్చి ఆవులను తరలిస్తున్న వాహనాలను పట్టుకుని వాటి స్వస్థలాలకు తరలిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో గోసంరక్షణ చట్టం ఉన్నప్పటికి అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే గోవధ నిషేద చట్టాన్ని అమలు చేయాలని, అక్రమంగా గోవులను తరలిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపాలని డిమాండ్ చేశారు.

### శరణంటూ మొక్కిన ప్రతి ఒక్కరిని కాపాడేదైవం అయ్యప్ప : ఎమ్మెల్యే వివేకానంద

**నిజాంపేట్, జూన్ 8, ప్రభాతవార్త**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 7, 26వ డివిజన్ పరిధి శ్రీనివాస్ నగర్‌లో శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ చైర్మన్ కోలన్ చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ ప్రణయ ధనరాజ్ యాదవ్, రాఘవేంద్ర రావు, శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు ఏవీ ఉన్ని క్రిష్ణన్ నంబూద్రి మెల్సంతి, శ్రీనివాసనగర్ కాలనీ అయ్యప్ప దేవాలయ ప్రధాన అర్చకులు నాగార్జున ఆచార్యులు (లాలుస్వామి) ఆధ్వర్యంలో అంగరంగా వైభవంగా శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు ఉంగరాలు శ్రీనివాస్, ఎన్.హరిబాబు, దీపక్, గురుస్వామి, ఇంద్ర కుమార్‌దేవ్, గ్రామ పెద్దలు కోలన్ లీడర్ నర్సింహరెడ్డి దంపతులు, సాయిలు యాదవ్, ఎన్ఎంసి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

## రాత్రికి రాత్రే అపార్ట్‌మెంట్ ప్రహరీని కూల్చిన నిర్మాణ సంస్థ

**-దగ్గరుండి నిర్మింపజేసిన కాంగ్రెస్ నాయకులు**

**బేగంపేట జూన్ 8,ప్రభాతవార్త**
బేగంపేట లో ఓ నిర్మాణ సంస్థ బరితెగించింది.రాత్రికి రాత్రే కుందన్ టవర్స్ అపార్ట్ మెంట్ కు చెందిన ప్రహరీని కూల్చివేసింది.ఆ మార్గం ద్వారా తమ వాహనాల రాక పోకలు సాగించేందుకు పథకం వేసింది.అయితే అపార్ట్‌మెంట్ వాసులు అప్రమత్తమై స్థానిక కాంగ్రెస్ నేతల సహకారం కోరడంతో కాంగ్రెస్ నేతలు గౌరపల్లి రమేష్,పద్మారెడ్డి ,సాంబయ్య,శ్రీకాంత్,సత్యనారాయణ,విజయ్ తదితరులు ప్రహరీని కూల్చిన ప్రాంతానికి చేరుకుని సదరు నిర్మాణ సంస్థ కు చెందిన వారిని పిలిపించి మాట్లాడారు.బస్తీకి చెందిన రోడ్లు చిన్నగా ఉంటాయని,అపార్ట్‌మెంట్ వాసుల ప్రహరీ నిర్మాణం కూల్చి ఆ మార్గం ద్వారా మీ వాహనాలు రాకపోకలు సాగించడం కష్టమవుతుందని,అలాగే ప్రహరీ కూల్చడం వల్ల కుందన్ టవర్స్ అపార్ట్‌మెంట్ వాసులు కూడా ఇబ్బందులకు గురవుతారని,మీకు అనుమతి ఉన్న మార్గం ద్వారానే రాకపోకలు సాగించాలంటూ సూచించడంతో సదరు నిర్మాణ సంస్థ తాము కూల్చిన గోడను తిరిగి నిర్మించారు.దీంతో బస్తీ వాసులు, అపార్ట్ మెంట్ వాసులు సంతోషం వ్యక్తం చేసారు.సకాలంలో స్పందించిన కాంగ్రెస్ నేతలకు వారు కృతజ్ఞతలు తెలియజేసారు.

## విప్లవాత్మక మార్పులు తెచ్చిన మహనీయుడు రామోజీరావు : ఎమ్మెల్యే



**అత్తాపూర్ మే8,ప్రభాతవార్త :** పత్రికా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన మహనియుడు రామోజీరావు అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం రాజేంద్రనగర్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో అరాంఘర్ చౌరస్తాలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....రామోజీరావు మృతి తెలుగు సమాజానికి తీరని లోటు అన్నారు.సాధారణ వ్యక్తిగా జీవితాన్ని మొదలుపెట్టి అక్షర యోధుడిగా అలుపెరగని యాత్ర చేసి చరిత్ర సృష్టించిన యోధుడు రామోజీరావు అని ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## రామోజీరావుకు త్యాగరాయ గానసభ ఘన నివాళి


రామోజీరావు చిత్రపటానికి నివాళులు అర్పించిన దృశ్యం

**చిక్కడపల్లి, జూన్ 8ప్రభాతవార్త:**
ప్రముఖ పత్రికాధినేత, ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ సిహెచ్.రామోజీ రావు మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ శనివారం సాయంత్రం త్యాగరాయ గానసభ నివాళి అర్పించింది. గానసభలోని కళాలలిత కళావేదికలో జరిగిన సంతాప సమావేశం గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జనార్దనమూర్తి మాట్లాడుతూ తెలుగుపత్రికారంగంలో రామోజీరావు ఒక ప్రభంజనం సృష్టించారని, ఆయన చేపట్టిన ప్రతిరంగంలో టీవీ ఛానెల్, మార్గదర్శి చిట్స్, ఉషాకిరణ్ మూవీస్ విజవంతంగా నిలిచి స్వర్ణహస్తంగా కీర్తిపొందారన్నారు. గానసభతో తన తండ్రి కళాసుబ్బారావుతో ఆయనకు నాటి రోజుల్లో అనుబంధం ఉండేదని గుర్తు చేసుకున్నారు. ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథరావు మాట్లాడుతూ జబర్దస్త్, పాడుతాతీయగా వంటి ఈటీవీలో కార్యక్రమాల ద్వారా ఎందరో అజ్ఞాత ప్రతిభావంతులైన కళాకారులకు వేదిక కల్పించి వారిని వెలుగులోకి తెచ్చినమహనీయుడు రామోజీరావు అని కొనియాడారు. గుర్తు చేసుకున్నారు.కళాపోషకుడు గుదిబండి వెంకటరెడ్డి తదితర గాయనీ గాయకులు పలువురు పాల్గొని రామోజీరావు తెలుగు భాషకు సమాజానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జీవిఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుదిబండి వెంకటరెడ్డి, అంతర్జాతీయ గానకళారత్న డాక్టర్ చింతలపూడి త్రినాథరావు, ప్రముఖ గాయని చిల్లా శివపార్వతి, సేవారత్న పురస్కారగ్రహీత వడ్లకొండ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## అద్భుతంగా సాగిన సినీ సంగీత విభావరి


వడ్లకొండ వెంకటరావును సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, జూన్ 8 ప్రభాతవార్త:**
శ్రీ శ్యామా గాయత్రి సాంస్కృతిక సంస్థ అధినేత్రి చిల్లా శివపార్వతి ఆధ్వర్యంలో బ్రోచేవారెవరురా నిను వినా రఘువర పేరుతో సిని సంగీత విభావరి, సేవారత్న పురస్కారగ్రహీత వడ్లకొండ వెంకటరావుకు ఆత్మీయ సత్కార కార్యక్రమం శనివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలిత కళావేదికలో జరిగింది. గౌరవ అతిథులుగా హాజరైన జీవిఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుదిబండి వెంకటరెడ్డి, అంతర్జాతీయ గానకళారత్న డాక్టర్ చింతలపూడి త్రినాథరావు, కళాబంధు వినోద్ గౌడ్ తదితరులు హాజరై వడ్లకొండ వెంకటరావును సత్కరించి అభినందించారు. ప్రముఖ గాయని చిల్లా శివపార్వతి స్వరసారధ్యంలో జరిగిన సినీ సంగీత విభావరిలో గాయనీ గాయకులు ఠాగూర్, ఎం.పాండురంగ ప్రసాద్, కె.శ్రీనివాస్‌మూర్తి, కళ్యాణ్ కోటంరాజు, డాక్టర్ విజయకుమార్, ఎస్.దిలీప్, సి.కోదండరామ్, మహేష్, మల్లెల వసుంధర, రాజ్యలక్ష్మి, చేపూరి లక్ష్మి, మేఘన, పూజిత, స్నేహిత, శ్రేయ, ప్రణీత గుప్త, శ్రద్ధ, హర్షిణి, పావన తదితరులు అద్భుతంగా గానం చేశారు.

## సికింద్రాబాద్‌లో క్రైస్తవుల ట్రంఫెట్ ఫెస్టివల్ ర్యాలీ

**కంటోన్మెంట్, జూన్ 8 ప్రభాతవార్త :** ట్రంఫెట్ ఫెస్టివల్ ఫెలోషిప్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ వెస్లీ చర్చి నుంచి ట్రంఫెట్ ఫెస్టివల్ ర్యాలీని నిర్వహించారు. మాజీ డీజీపీ స్వరణ్ జిత్ సేన్, పాస్టర్లతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. యేసు క్రీస్తు పాటలు పాడుతూ క్రీస్తు రెండవ రాకడపై అవగాణ కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ సెల్విన్ రాజు, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, చార్లెస్ సంపత్ తధితరులు పాల్గొన్నారు.

### తెలుగుజాతి ఔన్నత్యాన్ని నలుమూలల చాటిన రామోజీరావు

**-టిడిపి కింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా**

**ముషీరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచ నలుమూలల చాటిన వ్యక్తులలో రామోజీరావు ఒకరని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా కొనియాడారు. శనివారం రామోజీరావు మృతి చెందటం పట్ల తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ కమిటీ పక్షాన నివాళులర్పించారు. తెలుగువారి అస్తిత్వాన్ని కాపాడటానికి ఎన్నో ప్రయోగాలు చేసి, తెలుగువారి కోసం నిరంతరం తాపత్రయపడిన రామోజీరావు మరణం తెలుగువారికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, భానుప్రకాష్, జోగిందర్‌సింగ్ పాల్గొన్నారు.

## చెరువుల ఆక్రమణలపై కదం తొక్కిన కాంగ్రెస్ నాయకులు


చెరువును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కొంపల్లి, జూన్ 8, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీలోని దూలపల్లి గ్రామంలో తుమార్ చెరువు ఆక్రమణ, తూము కాలువల ఆక్రమణలపై కాంగ్రెస్ నాయకులు కదం తొక్కారు. దూలపల్లి గ్రామంలో తుమార్ చెరువు ఆక్రమణ, తూము కాలువల ఆక్రమణల గురించి దూలపల్లి గ్రామస్తులు సంప్రదించగా శనివారం మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డిలు కలిసి పరిశీలించి వెంటనే అక్రమ కట్టడాలను కూల్చివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్లుగా బీఆర్ఎస్ పభ్రుత్వ హయాంలో అనేక చెరువులు, కుంటలను నామరూపాలు లేకుండా చేసి ఎన్నో కాలనీలను నీట మునిగేలా చేశారని, కాంగ్రెస్ పజ్రాపాలనలో నేడు ప్రతి చెరువును, కుంటను కాపాడి ప్రజలకు వరదముంపు లేకుండా చూస్తూ భూగర్భ వనరులను కాపాడే బాధ్యత తీసుకుంటుందని స్పష్టం చేశారు. చెరువులు కుంటలను కబ్జాలు చేసేవారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తేలేదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు బైరి ప్రశాంత్‌గౌడ్, జిమ్మి దేవేందర్, దూలపల్లి కౌన్సిలర్ శివ కుమార్‌గౌడ్, పిపిఎస్ చైర్మన్ నరేందర్ రాజు, పిఏసీఎస్ డైరెక్టర్ దప్పు నరేందర్, దూలపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

## అశోక్‌నగర్ నాలాలో కొట్టుకువచ్చిన మృతదేహం

**ముషీరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్ నాలాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. ఎస్ఐ కె.ఎస్.రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం 11 గంటల సమయంలో అశోక్‌నగర్ నాలాలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందటంతో సంఘటనా స్థలికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. ఆ వ్యక్తి వివరాలు స్థానికులు ఎవరూ తెలపలేకపోవటంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి గాంధీ హాస్పటల్ మార్చురీలో భద్రపరిచామని ఎస్.ఐ తెలిపారు. చనిపోయిన వ్యక్తి సుమారు 45 సంవత్సరాల వయసు ఉండవచ్చునని, ఎర్ర రంగు గీతల చొక్కా, కాకీ రంగు ఫాంటు ధరించి ఉన్నారని, ఎవరైనా తెలిసిన వారు ఉంటే ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. ప్రమాదవశాత్తూ పడ్డారా లేక, మరే కారణంగా పడిపోయారా అన్నది తెలియాల్సి ఉంది.


**వార్త CLASSIFIEDS**

**LOST**
★ I, Anandula Sarvani W/o Anandula Narasimha Reddy, H.No. 1-1-652/2, F.No.401, Sri Radha Krishna Residency, Gandhinagar, Hyd-80, Aged 73, My Voter ID No. RXA0350488. Lost my Passport Bearing No. B1874275 Date of Issue 12.04.2000 at Hyd. If anybody find out the above said Passport, Request you please return to the following Address.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**బహిరంగ ప్రకటన**
సాధారణ ప్రజానీకానికి తెలియ జేయునది ఏమనగా., మా క్లయింట్లు బొడ్డుల జంగయ్య & బొడ్డుల రాణి మరియు బిజారం రవికి మధ్య జూనియర్ సివిల్ జడ్జ్, కూకట్‌పల్లి (Hon'ble Vecation Judge, రంగారెడ్డి జిల్లా) జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో పార్టీషన్ సూట్ O.S. No. 83 of 2024, I.A. No. 152 of 2024, ఇట్టి కేసు ఇరువురి మధ్యన ఇ.నెం. 1-60/30/1-6/30/30/134 (Old No. BO/134), ప్లాట్ నెం.30, విస్తీర్ణం 120 చ.గ.లు, అంజయ్యనగర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి మండలము, రంగారెడ్డి జిల్లాలో గల ఇట్టి ప్లాటు ఇద్దరి మధ్య పై తెలుపబడిన కోర్టులో వివాదములో వున్నందున ఎవరైనా కొనుటకుగాని, లావాదేవీలు జరిపినా చట్టరీత్యా చెల్లదు. వారిపై చట్టపరమైన క్రిమినల్ కేసులు వేయబడునని ఈ ప్రకటన ద్వారా హెచ్చరించడమైనది.
సం/- జిల్ల రమేష్
మారెపల్లి లలిత
కంచాల రామచందన
చంద్రదాస్ శిరీష
అడ్వకేట్లు
ఆఫీస్ నెం.1, ముంబై కాంప్లెక్స్,
మెగా థియేటర్ ప్రక్కన,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్-59.
ఫోన్ నెం: 9505450729

**IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI, AT:MEDCHAL**
**O.S. NO. 90 OF 2024**
BETWEEN:
1) AMIRINENI SUKANYA, W/o. Late Amirineni Muralidhar, A/a 57 Years, Occ: Housewife,
2) AMIRINENI HARISH BABU, S/o. Late Amirineni Muralidhar, Aged about 36 Years, Occ: Pvt. Employee,
3) AMIRINENI ANVESH BABU, S/o. Late Amirineni Muralidhar, Aged about 34 Years, Occ: Pvt. Employee,
The Plaintiffs No. 1 to 3 are resident of H. No. 49-266/2/D Padma Nagar Phase-1 Near Venkateswara Swamy Temple, Balanagar, Balanagar Township, Ranga Reddy District, Telangana - 500037. ...Plaintiff Nos.1 to 3
AND
1) The Tahasildar Office, Balanagar, Medchal Malkajgiri District.
2) All Concerned
...DEFENDANTS No. 1 & 2
Whereas the Plaintiffs above named field the case against the Defendants herein under to declare the Plaintiffs as the Legal Heir of the Late Amirineni Muralidhar, S/o. Late A.Venkata Basavaiah who died intestate on 15-04-2002 at Sai Krishna super speciality neuro hospital Kachiguda Hyderabad, and the same was posted to 13/06/2024. The "ALL CONCERN" are therefore directed to appear before the above court either in person or through your pleader with your defense if any at 10.30 AM on the above said date, failing which the above suit will be heard and determined ex-parte.
//BY ORDER OF THE HON'BLE COURT//
M/s. K. RAVI KANTH, M.L. DEEPAK, SHIVA, Advocates & Associates,
O/o. Flat No. 203, 2nd Floor, D. No 1-424 to 426, Sai Plaza, Union Bank of India Building, Mettuguda, Secunderabad – 500017. Cell No. 9125125199.
COUNSEL FOR THE PLAINTIFFS

**IN THE COURT OF THE HONBLE 1stJUNIOR CIVIL JUDGE, CUM CITI CIVIL COURT AT: SECUNDERABAD**
**OS.NO 475 OF 2019**
BETWEEN:
M/S. STATE BANK OF INDIA, S.M.E.Center, Administrative Office, 1st Floor, Patny Circle, Secunderabad -500003
.... Plaintiff Bank
And
SRI. KESARAN SAI CHARAN, S/o .Sri. Sekhar, ... Defendant
NOTICE
To,
Sri. Kesaran Sai Charan, S/o. Sri. Sekhar, Aged About 36 years, Occupation: Business, R/o. H.No. 5/748, Plot No. 12 Road No. 3, Banjara Hills, Hyderabad Pin code- 500013.
Please take notice that, the plaintiff bank has filed suit against you defendant for recovery of money amounting to Rs. 1,50,943/- [Rupees One Lakh Fifty Thousand Nine Hundred and Forty three Only], Vide O.S. No: 475 of 2019 before Honorable Ist Junior Civil Judge Court, Secunderabad, while the summons send were returned unserved Hon'ble court has directed the plaintiff bank for Substitute Service by causing Publication in News Paper.
Hence you defendant above is hereby informed to take notice in the above O.S. No: 475 of 2019 which is posted for your appearance on 26.06.2023 at 10.30 am before the Honorable court Ist Junior Civil Judge Court, at Secunderabad, in person or through your Counsel, failing which the matter will be decided by the Honorable Court in your absence setting you Ex-parte in accordance with Law.
By Order of the Court
Sd/-
Sri. Satyavolu Arun kumar
G.Siddappa,
Advocate / Hyderabad
# 218, 2'nd Floor, Kubera Towers, Narayanguda, Hyderabad - 500 029
(M) 9618038279, 9246585485

**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD**
**O.S. No. 317 of 2020**
Between:
Kothari Fire Safety Equipment ...Plaintiffs
And
M/s. Sree Chakra MEP Projects Pvt Ltd. And ors ....Defendants
To,
1. M/s. Sree Chakra MEP Projects Pvt Ltd Rep by its Managing Director Thimmarayudu Vadde Kothapalli Registered Office at Plot No. 3, Goutami Nagar, Nizampet Road, Kukatpally, Hyderabad – 500085
2. Thimmarayudu Vadde Kothapalli Office at Plot No. 3, Goutami Nagar, Nizampet Road, Kukatpally, Hyderabad – 500085
3. Sriveena Vadlamundi Office at Plot No. 3, Goutami Nagar, Nizampet Road, Kukatpally, Hyderabad – 500085
4. 4. Mr. Krishna Babu Office at Plot No. 3, Goutami Nagar, Nizampet Road, Kukatpally, Hyderabad – 500085
...Defendants No. 1 to 4
Please take notice that the above said has been filed by the Plaintiff seeking a relief of Recovery of Amount from the Defendants. The Hon'ble Court has posted the above said matter on 26-06-2024 for your appearance, if any. Please appear at 10:30 A.M. before the above mentioned court on 26-06-2024 with any objections failing which the above said matter will be decided in your absence and on merits.
Sd/- Ashish Samat, Advocate
H. No. 1-8-54/1/1, 2nd Floor, Mani Anjaiah Mansion, P.G. Road, Secunderabad.
Ph +91 9885085951

## ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం : తహసీల్దార్

### ఈ నెల 10వ తేదీ నుంచి ప్రజావాణి షురూ

**శామీర్‌పేట, జూన్ 8, ప్రభాతవార్త** ఈ నెల 10వ తేదీ నుంచి శామీర్‌పేట మండల కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని, సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నట్లు శామీర్‌పేట మండల తహసీల్దార్ యాదగిరిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10గంటలకు మండల కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంను ప్రారంభిస్తున్నట్లు, ఇక ప్రతి సోమవారం ప్రజావాణి, మండల స్థాయిలో సమీక్ష సమావేశాలు జరుగనున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు అందరు తప్పని సరిగా పాల్గొనాలని తహసీల్దార్ పర్యవేక్షణలో జరుగుతుందని అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలో జరిగే ప్రజావాణిలో ధరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. ధరఖాస్తులతో, వినతులతో, ఫిర్యాదులతో ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి రానున్నందున అధికారులు తప్పనిసరిగా సకాలంలో పాల్గొనాలని తహసీల్దార్ యాదగిరిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

## ఎన్‌సిసి క్యాంపులో వ్యక్తిత్వ వికాస తరగతులు



**గజ్వేల్, జూన్ 8 (ప్రభాతవార్త):** గజ్వేల్ బాలుర విద్యా సముదాయంలో సంగారెడ్డి బెటాలియన్ కల్నల్ రాజాదత్త ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ శిబిరంలో ఐదవ రోజు యోగా, కవాతు నిర్వహించడం జరిగింది. సంగారెడ్డి బెటాలియన్ మాజీ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రాజాదత్త వక్తగా కాడేట్లకు వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు క్యాంపు కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జి.మధుసూదన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా కల్నల్ రాజాదత్త మాట్లాడుతూ స్ట్రెస్ మేనేజ్మెంట్, టైమ్ మేనేజ్మెంట్ ఇంటర్వ్యూలను ఎదుర్కొనే విధానం, స్టేజ్ ఫియర్ మరియు ఆర్మీ ఆఫీసర్ ఉత్తీర్ణత పరీక్ష అయిన సర్వీస్ సెలక్షన్ బోర్డు నందు ఎంపికకు కావలసిన మెలకులను వివరించారు. అదేవిధంగా ఫైరింగ్, సాములేటర్ ఫైరింగ్‌లో దాదాపు 200 మంది కాడేట్లు పాల్గొన్నట్లు ఎన్‌సిసి అధికారి అజయ్‌కుమార్ తెలిపారు.

## మాజీ సిఎం కెసిఆర్‌ను కలిసిన ఉప్పల వెంకటేష్



**తలకొండపల్లి,జూన్ 8, ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుట్ల చంద్రశేఖరరావును ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో శనివారం కల్వకుర్తి నియోజకవర్గం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మరియు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్‌గారు కేసిఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ ఉప్పల వెంకటేష్‌తో కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధంచిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి బిఆర్ఎస్ పార్టీ నాయకత్వాన్ని బలప రుస్తూ కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని ప్రతిపక్షాల కుట్రలను ఎప్ప టికప్పుడు ఎండగడుతూ సామాన్య ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కేసిఆర్ సూచించినట్లు ఉప్పల వెంకటేష్ తెలియ జేయడం జరిగింది.



పురస్కారాలను అందజేస్తున్న సాహిత్య వేదిక ప్రతినిధులు

## ఘనంగా అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వార్షికోత్సవం

**తాండూరు, జూన్ 8, ప్రభాతవార్త :** తాండూరు పట్టణంలో అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా బి.పి నర్సింహులు గుప్తా, ముఖ్య అతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి డా నామోజు బాలాచారి పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. అనేక సాహిత్య ప్రక్రియల్లో అభినివేశం ఉన్న వారు తెలంగాణలో ఉన్నారని అన్నారు. నేటి కాలంలో మానవుల మధ్య సున్నితమైన మానవ సంబంధాలు లోపిస్తున్నాయన్నారు. ప్రస్తుతం చిన్నారులు తెలుగు చదివే పరిస్థితుల్లో లేరని, వారి కోసం బాలసాహిత్యం ప్రయత్నం చేయాలని కోరారు. వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్న కవులను, రచయితలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లాకు చెందిన 81మంది కవులు రచించిన పద్యాలు, గేయాలు, మణిపూసల రచన కవితలతో కూడిన అనంత సంకలన గ్రంథం, ప్రముఖ కవి రచించిన ప్రకృతి పరిమళం అనే మణిపూసల కావ్యాన్ని ఆవిష్కరించారు. శతావ ధాని డా. మలుగ అంజయ్య, రంగస్థల నటుడు మాలెల అంజిలయ్య గౌడ్‌లకు జీవన సాఫల్య పుష్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులు ఉస్మానియా విశ్వ విద్యాలయ పూర్వాచారులు డా. బాగయ్య, డా. తూర్పు మల్లారెడ్డి, డా. చంద్ర ప్రకాష్ రెడ్డి, సీనీ దర్శ కులు ఆర. నర్సింగ్‌రావు, తుల్జారాంసింగ్, కాగ్నా కళా సమితి అధ్యక్షులు పటేల్ శివకుమార్, అనంత సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షులు రాఘవేంద్రాచార్యులు, ఉపాధ్యక్షులు వడిచర్ల సత్యం, వివిధ ప్రాంతాల కవులు, రచయితలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 10నుంచి కలెక్టరేట్‌లో ప్రజావాణి షురూ

### మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 8, ప్రభాతవార్త**

ఈ నెల 10వ తేదీ నుంచి మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం ఇక ప్రతి సోమవారం యధావిధిగ జరుగుతుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. శనివారం ఆయన పేర్కొంటూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉండటంతో ప్రజావాణి కార్యక్రమాన్ని గత కొన్ని నెలల నుంచి తాత్కాలికంగ వాయిదా వేయటం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగ తిరిగి సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో వినతులు, ఫిర్యాదులు, ధరఖాస్తులు చేసుకోవటానికి ప్రజలు రావటం జరుగుతుంది. ఇక జిల్లా స్థాయి అధికారులు అందరు కూడ ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కానున్నారు.

## ఉపాధ్యాయుల సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్తా

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యేతో తమ సమస్యలను వివరిస్తున్న ఉపాధ్యాయులు

**షాద్‌నగర్, జూన్ 8, (ప్రభాతవార్త) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా రంగారెడ్డి జిల్లాకు మినహాయింపు ఇవ్వడం పట్ల స్థానిక ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాయలంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కలుసుకొని తమ ఆవేదనను తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఉపాధ్యాయులంతా కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారితో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... గత ప్రభుత్వ పాలనలో ఉపాధ్యాయుల బదిలీలో చాలా తప్పులు జరిగాయని, ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో సీనియర్, జూనియర్ అని చూడకుండా ఇష్టానుసారంగా పోస్టింగులు ఇవ్వడంతోనే ఈ సమస్యలు వచ్చాయని అన్నారు. ఈ విష యాన్ని సహితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా మని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**పూడూరు, జూన్ 8, ప్రభాతవార్త :** కలహాల కాపురంతో జీవితంపై విరక్తి చెంది ఓవ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్‌జిల్లా పూడూరు గ్రామంలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి కథనం ప్రకారం పూడూరు మండలకేంద్రానికి చెందిన పిరంగి మహేష్ (24)అనే వ్యక్తి గ్రామంలో వ్యవసాయం చేసుకొని జీవిసున్నాడు. అయితే గతకొంత కాలంగా కుటుంబ సభ్యులతో తరచూ మహేష్ గొడవపడు తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరులేని సమయంలో దూలనికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు మహేష్ తండ్రి పిరంగి కాశయ్య పిర్యాదుమేరకు చెన్‌గోముల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఎత్తిపోతలతో కొడంగల్‌కు మహర్దశ

- నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకంపై సిఎం రివ్యూ
- పథకం వ్యయాన్ని రెట్టింపు చేసిన ప్రభుత్వం
- పసిడి పంటలతో కళకళలాడనున్న కొడంగల్
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం

**కొడంగల్,జూన్ 8ప్రభాతవార్త** అన్నిరంగాల్లో వెనుకబాటుకు గురవుతూ ఎలాంటి సాగునీటి వసతి లేక వర్షాభావంపైనే ఆధా రపడిన కొడంగల్ నియోజకవర్గానికి నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా మహర్దశ రానుంది. ఉమ్మడి రాష్ట్రంతో పాటు పోరాటాలతో సాధించుకున్న తెలంగాణాలోను కొడంగల్ నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురైంది. కర్నాటక రాష్ట్ర సరిహద్దులో విసిరేసిన విస్తార్లా పాలకుల కక్ష్య సాధింపు చర్యలతో ఈ ప్రాంతం అభివృద్ధికి అమడ దూరంలో ఉంది. గతంలో ఎప్పుడో ఇక్కడినుంచి ప్రాతినిత్యం వహించిన ఎమ్మెల్యే అచ్యుతారెడ్డి మంత్రి కావడంతో కరెంటు తదితర అభివృద్ధి పనులు కాస్తా ఇప్పటికి కనిపిస్తున్నా అనంతరం కొడంగల్‌కకు ఎలాంటి మంత్రిపదవి దక్కక పోవడంతో కొడంగల్ అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైంది. ప్రస్తుతం కొడంగల్ నుంచి ప్రాతినిత్యం వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో కొడంగల్‌కు మంచిరోజులు వచ్చాయని చెప్పవచ్చు. ఆరు నెలల క్రితమే కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి గాను కడా అధికారిని నియమించి తనదైన శైలిలో అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. నాలుగు నెలల క్రితం నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకంతో పాటు వివిధ అభివృద్ధి పనులకు గాను రూ.5వేల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తదనంతరం పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగియడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతీసుకొని శుభవార్త చెప్పారు. ఈ ప్రాంతంలో రైతుల దశ దిశ మారే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ప్రకటించారు. నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకం సామర్థ్యాన్ని పెంచుతు 2.1టీఎంసీల నుంచి 4.022 టీఎంసీల నీటినిల వ్వను పెంచేందుకు వీలుగా చెర్వు లను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకుగాను ప్రాజెక్టు అం చనా వ్యయాన్ని రూ.2945 కోట్ల నుంచి రూ.4350 కోట్లకు పెంచారు. ప్రాజెక్టు రెండు దశల్లో పనులను పూర్తి చేసి లక్షా ఎకరాలకు సాగునీరు అందిస్తు నారాయణపేట్ జిల్లాకు తాగునీటిని అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సాగు తాగునీటి అవసరాలను తీర్చేలా పథకం పనులకు రూపకల్పన చేసినట్లు తెలుస్తుంది. పథకం లైడార్ సర్వే నిమిత్తం ఇదివరకే హెలిక్యాప్టర్ ద్వారా సర్వే పూర్తి చేశారు. సర్వే పనులకు గాను ప్రభుత్వం రూ.18కోట్లు మంజూరీ చేయడం జరిగింది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలోనే ఎమ్మెల్యేగా కొనసాగుతున్న సమయంలోనే రేవంత్‌రెడ్డి ఈ పథకంను మంజూరీ చేయించినా బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు కొడంగల్‌నుంచే ప్రాతినిత్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి జీఓ 69కి జీవం పోస్తు పథకానికి పరిపాలన అనుమతులు ఇచ్చారు. పథకం ద్వారా కొడంగల్, మక్తల్, నారాయణపేట్ నియెజకవర్గాల్లో లక్షా ఎకరాలకు సాగునీరు, నారాయణపేట్‌కు తాగునీరు అందించాలనే సదుద్దేశ్యంతో ఈ పథకాన్ని రూపకల్పన చేశారు. ఈ పథకం ద్వారా మక్తల్ నియోజకకవర్గంలో 25,786 ఎకరాలు, నారాయణపేట్ నియోజకవర్గంలో 20,472 ఎకరాలు, కొడంగల్ నియోజకవర్గంలో 53,745 ఎకరాలకు సాగునీరు అందనుంది. రెండు దశలో పనులు పూర్తి చేసేం దుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. నారా యణపేట్- కొడంగల్ ఎత్తిపోతల పథక ద్వారా కొడంగల్ నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు సీఎం రేవం త్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడం పట్ల కొడంగల్ దశ మారనుందిని నియోజకవర్గ రైతులు, ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

# ఎన్నికల కోడ్ ముగియడంతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అధికారుల దృష్టి

### ఇక క్షేత్రస్థాయి పర్యటనలకు జిల్లా స్థాయి అధికారులు



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ భవన సముదాయం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 8, ప్రభాతవార్త**

పార్లమెంట్ ఎన్నికలు ముగియటంతో పాటు ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎన్నికల కోడ్) ముగిసినందున ఇక అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై (ప్రజా పాలనపై) జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టిని సారించనున్నారు. ఏప్రిల్ నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో ఎన్నికల కోడ్ అమలులోకి రావటం జరిగింది. గత మే 13వ తేదీన మల్కాజ్‌గిరి లోకసభ (పార్లమెంట్) ఎన్నికలు జరగటం, ఈ నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) జరిగిన సంగతి తెలిసిందే. మల్కాజ్‌గిరి నూతన ఎంపిగా ఈటల రాజేందర్ (బిజెపి) భారీ మెజార్టీతో గెలుపొందిన సంగతి విధితమే. మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ కూడ మల్కాజ్‌గిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగ వ్యవరించటంతో ఎక్కువగా ఎన్నికల నిర్వాహణపైనే దృష్టిని సారించటం జరిగింది. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని ఎన్నికల కోడ్‌తో కూడ తాత్కాలికంగ వాయిదా వేసిన సంగతి తెలిసిందే. జిల్లా స్థాయి అధికారులు కూడ ఎన్నికల నిర్వాహణలో విధులు నిర్వహించటం జరిగింది. ప్రభుత్వం చేపట్టె అభివృద్ధి పనులు రెండు నెలల నుంచి ఎన్నికల కోడ్‌తో పెండింగ్‌లో పడటం జరిగింది. ఇక ఎన్నికల కోడ్ ముగిసినందున రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలపై ప్రజల విన్నపాల మేరకు ప్రతి చర్యలు తీసుకోనున్నారు. ప్రజలు కూడ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందటానికి ధరఖాస్తులు చేసుకోవటానికి ప్రజలు ఎదురుచూస్తున్నారు. 200యూనిట్స్ ఉచిత విద్యుత్ పొందటానికి రాని వారు ధరఖాస్తులు చేసుకోవటానికి ఎదురుచూస్తున్నారు. అదే విధంగ 500రూపాయలకే గ్యాస్ సిలిండర్ పొందటానికి కూడ పలువురు ధరఖాస్తులు చేసుకోవటానికి రాని వారు ఎదురుచూడటం జరుగుతుందని ప్రభుత్వం మళ్లీ ధరఖాస్తుల స్వీకరణకు, చేసిన ధరఖాస్తులలో సవరణలకు అవకాశం ఇవ్వాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామాలలో, మున్సిపాల్టీలలో ఉన్న సమస్యల పరిష్కారానికి ఇక అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇక ప్రభుత్వం కూడ ప్రభుత్వ పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి కొరకు సమస్యల పరిష్కారం కొరకు చర్యలు తీసుకోవటానికి అధికారులు ఇక శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులతో పాటు విద్యార్థులకు యూనిఫామ్స్ అందించటానికి సంబంధిత అధికారులు కూడ చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగ రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్య, ఆరోగ్యం, వ్యవసాయం, విద్యుత్, ఆర్‌అండ్‌బి, ఇరిగేషన్, డిఆర్‌డిఏ, పలు శాఖల సంబంధిత అధికారులు, సంక్షేమ శాఖలకు సంబంధించి అధికారులు కూడ క్షేత్రపర్యటనలు చేసి పరిశీలించి సమీక్షలు చేసి అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలుపై దృష్టిని సారించనున్నారు. జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు అభిషేక్ ఆగస్త్య, విజయేందర్‌రెడ్డిల పర్యవేక్షణలు కూడ జిల్లాలో కొనసాగనున్నాయని చెప్పవచ్చు. వర్షాకాలం ఆరంభం అవుతున్నందున గ్రామపంచాయతీల, మున్సిపాల్టీల, ఆరోగ్యశాఖ అధికారుల పనితీరుపై సమీక్షలు జరగనున్నాయని చెప్పవచ్చు. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు పూర్తి కావటంతో తెలిసిందే. ఇక గ్రామపంచాయతీలకు సర్పంచు,వార్డుసభ్యుల ఐదేళ్ల పదవీకాలం ఫిబ్రవరి 1వ తేదీతో ముగిసినందున ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించటానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. మరో నెలలోపే జూలై 4వ తేదీ వరకు ఎంపిటిసి,ఎంపిపి,జడ్పీటిసి,జడ్పీచైర్మన్ పదవులకు కూడ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ ఎన్నికల నిర్వాహణకు ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నందున ఎపుడు నిర్వహించేది సందిగ్దంగ ఉందని చెప్పవచ్చు. ఇక ప్రస్తుతం అధికార యంత్రాంగం మాత్రం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించనుందని చెప్పవచ్చు.

## రాజీమార్గమే రాజ మార్గంగా కేసులు పరిష్కరించుకోవాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి



లోక్ అధాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తిశ్రీనివాస్‌రెడ్డి

**వికారాబాద్,జూన్ 8, ప్రభాతవార్త:** రాజీ మార్గమే రాజ మార్గంగా జాతీయ లోకదాలత్‌లో కేసులు పరిష్కరించుకున్నట్లైతే కక్షిదారుల సమయం..కోర్టు సమయం వృధా కాకుండా ఉంటుందని వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీమార్గాన్ని ఎంచుకున్న కక్షిదారులకు సంబంధించిన కేసులను సత్వరమే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లాలో లోక్ అదాలత్ ద్వారా మొత్తం 2652 కేసులు పరిష్కరించడం జరిగిందని తెలిపారు. వికారాబాద్ కోర్టు పరిధిలో 6,366 కేసులు, పరిగి లో 461 కేసులు, తాండూరు లో 1,216 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కక్షిదారులు రాజీమార్గాన్ని ఎంచుకోకపోతే..కోర్టులలో కేసులు పెరుకపోవడము జరుగుతుందన్నారు. కొన్ని సంవత్సరాలుగా కోర్టులలో కొనసాగి ఆ తరువాత పై కోర్టులకు అప్పీళ్లు వెళ్ళడం వల్ల కేసులసంఖ్య పెరుగుతూ ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కొక్క కేసు పది సంవత్సరాలు నడుస్తుందని దీంతో విలువైన సమయం వృధా అవుతుందని పేర్కొన్నారు. రాజీ కి ఆమోదయోగ్యమైన కేసులను రాజీ చేసుకునే విదంగా ఈ జాతీయ లోకదాలత్ ను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒక్కసారి నిర్వహించే లోక్ అధాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ లోక్ అధాలత్‌లో వాహన ప్రమాదాల కేసులు. డ్రంకన్ డ్రైవ్ కేసులు, భూమితగాదాల కేసులు, భార్యాభర్తల కేసులు, చిన్న చిన్న కొట్లాట కేసులు, బ్యాంక్ అప్పుల కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. బ్యాంకులలో తీసుకున్న అప్పు వడ్డీతో పేరుకుపోయినట్లైతే..వడ్డీ తొలగించి అసలు మాత్రమే కట్టించుకునే వెసులుబాటు లోకదాలత్ లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. చెక్ బౌన్స్ కేసులు, ప్రిలిటీగేషన్ కేసులు రాజీ పడే అవకాశముంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, సీనియర్ సివిల్ జడ్జీ, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ సెక్రెటరీ డిబి శీతల్, అదనపు న్యాయమూర్తి శ్రుతి దూత, జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటేష్, ఉపాధ్యక్షులు సయ్యద్ కయ్యుమ్, పీపీ లు రాజేశ్వర్, అన్వేష్ సింగ్, సమీనబేగం తదితరులు పాలుగొన్నారు.

## కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : తిరుపతిరెడ్డి

**కొడంగల్,జూన్ 8ప్రభాతవార్త** కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తు రాష్ట్రంలోనే కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం నియోజకర్గంలోని కొడంగల్,బొంరాస్‌పేట్,దుద్యాల,దౌల్తాబాద్ మండలాల్లో పెద్ద ఎత్తున బీటీ రోడ్ల పనులకు భూమిపూజ నిర్వహించి అభివృద్ధి పనులను ప్రారంబించారు. కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్ నుంచి టేకుల్‌కోడ్ రుద్రారం వరకు రూ.15కోట్లు,రావులపల్లి నుంచి మద్దూర్‌కు రూ.40కోట్లు,పర్సాపూర్ నుంచి పాతకొడంగల్ తండాకు రూ.11కోట్లు, హస్నాబాద్ నుంచి నీటూర్ వరకు రూ.28కోట్లు,హస్నాబాద్ నుంచి పల్గురాళ్ళతండా,కుదురుమళ్ళ నుంచి దుద్యాల నుంచి లింగంపల్లి తదితర రోడ్ల పనులను ప్రారంబించారు. ఈ సందర్బంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతు కొడంగల్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని,అందులో భాగంగానే ఇదివరకే వేలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. రోడ్ల అభివృద్ధితో పాటు విద్య,వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. కోస్గీలో ఇంజనీరింగ్ కళాశాల,మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల,కొడంగల్‌లో మెడికల్ కళాశాల,నర్సింగ్ కళాశాల, బొంరాస్‌పేట్,దౌల్తాబాద్ మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మంజూరీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. మరోపక్క కొడంగల్ నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు గాను 69జీఓ ద్వారా రూ.4వేల కోట్లకు పైగా నిధులతో కొడంగల్-నారాయణపేట్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కొడంగల్ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్,మండల పార్టీ అద్యక్షులు నందారం ప్రశాంత్, ఎండి.యుసుఫ్, ఏన్గుల భాస్కర్, మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్, వెంకట్‌రెడ్డి, నయ్యూం,దాము,అనంద్‌రెడ్డి పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రహ్లాదరావు పాల్గొన్న రైతులు

## రైతులు లాభాలను తెచ్చిపెట్టే పంటలు వేసుకోవాలి

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు అసిస్టెంట్ డైరెక్టర్ సెరికల్చర్ మల్లికార్జున్ ఉద్యాన శాఖ అధికారి వైజయంతి కళ్యాణ్

**కుల్కచర్ల,జూన్ 8, ప్రభాతవార్త** ఆయిల్‌ఫామ్ పంట సాగుపై అపోహలు వద్దని వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పంట ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చుని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద రావు అసిస్టెంట్ డైరెక్టర్ సెరికల్చర్ మల్లికార్జున్, ఉద్యాన శాఖ అధికారి వైజ యంతి కళ్యాణ్, భరత్ రంగానాయకులు రైతులకు సూచించారు. శనివారం వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం కుల్కచర్ల మండల కేంద్రంలోని వివేకానంద జూనియర్ కళాశాల ఆవరణలో రైతులకు ఆయిల్‌ఫామ్ పంటపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫామ్ పంటసాగులో పాటిం చవలసిన పద్ధతులు పంట యొక్క వివరాలను సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ వైఎస్ రంగనా యకులు రైతులకు వివరించారు. నీటి వసతులున్న వ్యవసాయ క్షేత్రాల్లో ఆయి ల్‌ఫామ్ తోటలు సాగుచేస్తే రైతులు ఎక్కువ లాభాలు పొందవచ్చుని తెలిపారు. వికారాబాద్ జిల్లాలో కలెక్టర్ ప్రోత్సాహంతో కొత్తగా ఆయిల్‌ఫామ్ పంట సాగుకు అనువైన జిల్లాగా వికారాబాద్ గుర్తింపు పొందిందని ఈ పంట పండిస్తున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఇప్పటికవరకు ఆయా ప్రాంతాల్లోని రైతులు 1700 ఎకరాలు ఆయిల్‌ఫామ్ పంట పండిస్తున్నారని తెలిపారు. అనంతరం రైతుల సందేహాలన్నింటికి సమాధానాలు తెలిపి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు ఉద్యాన శాఖ అధికారులు వ్యవ సాయ ఖాఖ అధికారులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న గెలుపుతో నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తాం

### డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు



కడ్తాల్‌లో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కడ్తాల్, జూన్ 08 ప్రభాతవార్త :** నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపుతో కడ్తాల్ మండల కేంద్రంలో కడ్తాల్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్ ఆధ్వర్యంలో టపాకాయలు పేలుస్తూ సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా డిసిసి అధికార ప్రతినిధి ఎంపిటిసి ఫొరం జిల్లా గౌరవ అధ్యక్షులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, మండల అధ్యక్షుడు బిచ్యానాయక్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తీన్మార్ మల్లన్న గెలవడంతో నిరుద్యోగుల సమస్యలన్ని పరిష్కారం అవుతాయని తెలిపారు. ప్రతి పట్టభద్రుడు ఆలోచించి ఓట్ల రూపంలో ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కృషి చేశారన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల కోసం చట్టసభలో తీన్మార్ మల్లన్న గళం విప్పుతారని అన్నారు. తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించిన నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రులందరికి, ఉపాధ్యాయులందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు జాంగీర్‌బాబా, సీనియర్ నాయకులు సేవాదళ్ లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు మల్లేష్‌గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్, టౌన్ ర్కింగ్ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, జాంగీర్ అలీ, సత్యం యాదవ్, మల్లయ్య, క్యామ శేఖర్, శంకర్, బాలరాజు, జగన్, చెన్నయ్య, రామ్, గుదరాములు, శ్రీశైలం, క్యామ రాజేష్, టౌన్ యూత్ అధ్యక్షులు భానుకిరణ్, ఎర్రోళ్ల శ్రీకాంత్, ఇమ్రాన్ బాబా, బోసు రవి, శ్రీకాంత్, విజయ్, రామకృష్ణ, రంగా, లక్ష్మణ్, మహేష్, శ్రీను, చందు పాల్గొన్నారు.

## గ్రూప్-1 పరీక్షలకు పటిష్టమైన బందోబస్తు

### జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగే విధంగా కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ కోటి రెడ్డి మాట్లాడుతూ..జిల్లాలోని వికారాబాద్, తాండూరు,పరిగి,యాలాలలోమొత్తం 13 గ్రూప్-1 పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 5468 మంది అభ్యర్థులు ఉన్నారని ,పరీక్ష కేంద్రాల దగ్గర ఎలాంటి ఆటంకాలు కల్గకుండా కట్టుదిట్టంగా బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది .కావున ఎవ్వరు కూడా గుంపులు గుంపులుగా గుమికుడి ఉండవద్దు,ఇట్టి విషయం పైన పోలీస్ అధికారులకు సహకరించాలని,అభ్యర్థులకు ట్రాఫిక్ లేదా ఇతర ఏదైనా ఇబ్బంది ఉంటే డైల్ 100కి కాల్ చేసి పోలీస్ అధికారుల సహాయం తీసుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపారు.